www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 14 ఆగస్టు 2025
5
కాకినాడ



మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పుష్పవతి



ప్రజాశక్తి - కాజులూరు

రామచంద్రపురం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా సలాది పుష్పవతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ గతంలో బందాపుడి ఎంపిటిసి సభ్యురాలుగా పనిచేయడం జరిగిందన్నారు. జనసేన పార్టీలో తాను చేస్తున్న సేవలను గుర్తించిన మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎంపిక చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్, రామచంద్రపురం జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, మండల జనసేన అధ్యక్షులు బొండా వెంకన్నకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విస్తారంగా వర్షాలు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- జిల్లాలో 766.7 మిల్లీమీటర్ల వర్షపాతం
- కలెక్టరేట్, మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



రౌతులపూడిలో మునిగిపోయిన వరి పంట

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ 766.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా శంఖవరం మండలంలో 78 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. రౌతులపూడి, తాళ్లరేవు, ప్రత్తిపాడు, కిర్లంపూడి, కరప, గొల్లప్రోలు, సామర్లకోట, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో ఏకధాటిగా వర్షం కురిసింది. ఈదురు గాలులకు చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

తాళ్లరేవు మండలంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పోలేకుర్రు పంచాయతీ తూర్పు పేట, తాళ్లరేవు పంచాయతీ పెంకె వారి పేట, బైపాస్ కాలనీ నీట మునగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తాళ్లరేవు శ్రీరామ నగర్‌లో డ్రైనేజీ, సిసి రోడ్డు ఏకమై మురుగు నీరు రోడ్డుపై ప్రవహించింది. దీనితో వీధిలో ప్రజలు ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. కోరంగి పంచాయతీ సీతారామపురం లో మెయిన్ రోడ్డు, తాళ్లరేవులోని వడరేవు వీధి వర్షం నీటితో మునిగిపోయి కాలువలను తలపించాయి. ప్రయాణికులు వర్షపు నీటిలోనే ప్రయాణించాల్సి వచ్చింది. **కాజులూరు** మండలంలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు కాలువలను తలపించేలా వర్షపు నీటితో నిండిపోయాయి. కోలంక వద్ద కాకినాడ కోటిపల్లి ప్రధాన రహదారి, గొల్లపాలెం ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షానికి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్లపై చెట్లు కొమ్మలు విరిగిపడడంతో రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. **గొల్లప్రోలు** పట్టణంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గత వారం రోజులుగా ఎండతీవ్రతతో ఇబ్బందులు పడిన ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు. ఇదిలావుంటే వర్ష ప్రభావంతో గొల్లప్రోలు చుట్టుపక్కల ప్రాంతాల్లో కురిసిన వర్షంతో సుద్దగడ్డ, ఏలేరు కాలువల్లో నీటి ప్రవాహం పెరిగింది. నీటి ప్రవాహం మరింతగా పెరిగితే పంట పొలాలు మునిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **రౌతులపూడి** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో రహదారులు, పంట పొలాలు జలమయమయ్యాయి. మండలంలో గత నాలుగు రోజులుగా వరి నాట్లు వేస్తున్నారు. భారీ వర్షంతో వరి నాట్లు పూర్తిగా నీట మునిగాయి. దీంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఎ.మల్లవరం రహదారిపై వర్షపు నీరు పొంగిపొర్లింది. ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. **పెద్దాపురం** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంలో జనజీవనం స్తంభించింది. మెయిన్ రోడ్డులో కొనుగోలుదారులు లేక వ్యాపారాలన్నీ వెలవెలబోయాయి.

కాకినాడ జిల్లా వ్యాప్తంగా 13వ తేదీ బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 36.5 మిల్లీమీటర్ల సగటుతో జిల్లాలో 766.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా శంఖవరం మండలంలో 78 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా యు.కొత్తపల్లి మండలంలో 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. శంఖవరం మండలంలో 78 మిమీ, రౌతులపూడి 71 మిమీ, తాళ్లరేవులో 68.8 మిమీ, ప్రత్తిపాడులో 66.6 మిమీ, కిర్లంపూడిలో 64 మిమీ, కరపలో 62.4 మిమీ, గొల్లప్రోలులో 62.2 మిమీ, కాజులూరులో 58.2 మిమీ, పెదపూడిలో 46 మిమీ, ఏలేశ్వరం 30.6 మిమీ, కాకినాడ అర్బన్‌లో 29.6 మిమీ, తుని 25 మిమీ, కాకినాడ రూరల్‌లో 21.5 మిమీ, జగ్గంపేట 20.8 మిమీ, కోటనందూరు 18.4 మిమీ, గండేపల్లెలో 15.6 మిమీ, సామర్లకోట 10.8 మిమీ, పెద్దాపురం 7.8 మిమీ, పిఠాపురం 5.8 మిమీ, తొండంగి3.2 మిమీ, యు కొత్తపల్లి 2.4 మిమీ చొప్పున వర్షపాతం నమోదయింది.



తాళ్లరేవులో మునిగిన లోతట్టు ప్రాంతం

కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రానున్న మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు, తహశీల్దార్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేశామన్నారు. భారీ వర్షాల దృష్ట్యా క్షేత్రస్థాయిలో అధికారులంతా అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు తగు సూచనలు చేయాలని, అవసరమైన సహాయక చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ప్రజలు ఉండరాదని సూచించారు. భారీ వర్షాల దృష్ట్యా కలెక్టరేట్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో వర్షాల వలన ఎటువంటి ఇబ్బంది ఏర్పడినా రోడ్డు తెగినా, చెట్టు కూలినా, ట్రాఫిక్ ఇబ్బంది కలిగినా టోల్ ఫ్రీ నెంబర్, కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి వెంటనే సమాచారం తెలియజేయాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి, మండల రెవెన్యూ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కంట్రోల్ రూమ్ నెంబర్లు వివరాలు

13 వ తేదీ బుధవారం రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు కె.సతీష్‌నాయుడు నెంబర్ 9515950989కు, 14వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండి ఉమామత్ ఉన్నిసా నెంబర్ 9391957377, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎన్.శ్యామల నెంబర్ 9989468610, రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు, 15వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కె.సురేష్ కుమార్ 8247655141, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎల్‌వి రఘువీజ 9553393102, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఆర్.ఆనందబాబు- 6304032530, 16వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిఎస్‌ఎస్.శ్రీధర్ 9491343550, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సుధా మాధురి-9502017997, రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు ఎ.రామలక్ష్మి 9676361332, కొత్తపల్లి అనిల్ 9492345684 తదితర సిబ్బంది తుపానుకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు, అభ్యంతరాలను టెలిఫోన్ (ల్యాండ్ లైన్ నెం.0884 2356801) తెలియచేయాలన్నారు.



రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ట్రంప్ సుంకాలను నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

భారత దేశ రైతాంగం, పరిశ్రమలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడు ఈశ్వరరావు, కెఎస్. శ్రీనివాస్ మాట్లాడారు. దేశ రైతాంగం తన విత్తనం పై హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, మహా రాష్ట్రలో బంగాళాదుంప విత్తనంపై పెప్సీ కంపెనీ రైతులపై కేసులు పెట్టి తాము ఇచ్చిన విత్తనం మాత్రమే వేయాలని బెదిరిస్తుందని అన్నారు. ఇప్పటికే పత్తి, మిర్చి వంటి పంటల్లో బీటీ విత్తనాలు వచ్చాయని, ఆహార పంటల్లో విత్తనాలపై బహుళ జాతి కంపెనీలు పెత్తనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇస్తుందని విమర్శించారు. ట్రంప్ బెదిరింపులకు మోడీ లొంగిపోతూ రైతాంగాన్ని నడ్డివిరిచే చర్యలకు పాల్పడుతుందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో రైతాంగం, కార్మికులు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఆక్వా రైతుల ఉత్పత్తి ఖర్చు పెరిగిపోతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి మన రాష్ట్ర ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పెండెం జాను, కొప్పాడి మహాలక్ష్మి, పులుపకూర కృష్ణ, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నగర నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ

ఆశా వర్కర్ల నగర నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో నగర అధ్యక్షులు ఎ.పద్మావతి అధ్యక్షతన ఆశా వర్కర్ల నగర మహాసభ జరిగింది. ఈ మహాసభలో సిఐటియు ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.పద్మ పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లు ఎన్నో పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చారని, ఆశ వర్కర్లను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో ఆశ వర్కర్లు పనిచేస్తున్నారని, వీరికి కనీస వేతనాలు తక్షణమే ఇవ్వాలన్నారు. కనీస వేతనాల సాధన కోసం రాబోయే కాలంలో పెద్దఎత్తున ఆందోళన చేయడానికి కార్మికులంతా సిద్ధపడుతున్నారన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీ రాబోయే కాలంలో మరిన్ని ఉద్యమాలు పోరాటాలకి నాయకత్వం వహించాలన్నారు. అనంతరం నూతన నగర కమిటీ అధ్యక్షులుగా ఎస్.లక్ష్మి, కార్యదర్శిగా ఎం.భారతి ప్రియ, కోశాధికారిగా సిహెచ్.వేణితోపాటు 21 మందితో కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు, నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, సత్యవతి, అమ్ములు, రాణి, పాప, నాగలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన ఆశా వర్కర్స్ కార్యవర్గం

వారాంతపు సెలవు అమలుకు చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు పూర్తి రోజు వారాంతరపు సెలవు అమలు చేయాలని కార్మికులు కోరారు. బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి కార్మికులు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిఐటియు నాయకులు డి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పండుగ సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య విభాగంలో పనిచేసే కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. రక్షణ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వర్రే గిరిబాబు, మడికి కృష్ణ, అండుగల సురేష్, అప్పారావు, వర్రే రమణ, ముత్యాల సత్యనారాయణ, దొండపాటి శేఖర్, సతీష్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఆదిత్య విద్యార్థి

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి డేటా సైన్స్ రెండో ఏడాది విద్యార్థి పి.వేదసంహిత జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికకావడంపై ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర జూనియర్ అంతర జిల్లాల అథ్లెటిక్ చాంపియన్ షిప్ - 2025 పోటీలు చీరాలలోని విఆర్‌ఎస్, వైఎస్‌ఆర్ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీలలో అండర్-20 కేటగిరీలో ఆదిత్య డిగ్రీ కళాశాలలో డేటా సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి.వేదసంహిత షాట్ పుట్ విభాగంలో 10.52 మీటర్లు విసిరి ప్రథమ స్థానం, డిస్కస్ త్రోలో 24.71 మీటర్లు విసిరి ద్వితీయ స్థానంలో నిలిచి బంగారు, రజిత పతకాలను సాధించారన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు ఎంపికైన ఆ విద్యార్థినిని ఘనంగా సత్కరించారు. అలాగు ఆదిత్య విద్యాసంస్థల ఛర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు వేదసంహితను అభినందించారు.



క్రీడాకారిణిని అభినందిస్తున్న నాయుడు

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కరప

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపి ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌ఎ పంతం నానాజీ అన్నారు. బుధవారం తూరంగి గ్రామం నుంచి కరప మండలం వేళంగి గ్రామం వరకూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేళంగిలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో నగదును రైతు అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. తొలుత మోడీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టిడిపి రూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, టిడిపి నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, ఎస్‌టి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రకాష్ గౌడ్, కరప మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముద్రగడ రమేష్, కరప డిసి ఛైర్మన్ పుణ్యమంతుల గంగసత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపి, ఎంఎల్‌ఎలు

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం స్థానిక జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో స్వర్గీయ సూరపురాజు జైభార్గవ్ జ్ఞాపకార్థం స్థానిక రైతు సంఘ నాయకులు కంటే జగదీష్‌మోహన్ తల్లిదండ్రులు సుమారు రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన భోజనశాల, ఆర్‌ఒ ప్లాంట్‌ను జై భార్గవ్ జయంతి సందర్భంగా ఎంఎల్‌ఎ ప్రారంభించారు. హెచ్‌ఎం రాయుడు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో సమస్యలు ఏవైనా ఉంటే లిఖితపూర్వకంగా అందజేస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. భోజనశాల, ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు చేసిన కంటే బాబును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎతోపాటు, కంటే బాబును పాఠశాల సిబ్బంది, ఎస్‌ఎంసి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, టిడిపి నాయకులు రాజా సూరిబాబు రాజు, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, ఎంఎంసి వైస్ ఛైర్మన్ పచ్చాకుల లోవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భోజనశాలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

విలీన గ్రామాల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలంలోని విలీన గ్రామాల సమస్యలను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని సిపిఎం రూరల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ నెల 15న కాకినాడలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్న పవన్‌కల్యాణ్‌కు అందజేసే వినతిపత్రాన్ని సిపిఎం మండల కమిటీ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు బుధవారం మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట 6 పంచాయితీలకు 14 ఏళ్ళుగా పాలకవర్గాలు లేకుండా పోయాయని అన్నారు. దీంతో ఆర్థిక సంఘం నిధులు, ప్రత్యేక గ్రాంట్‌లు రాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కావున ఆరు గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌గా రూ.240 కోట్ల నిధులు అత్యవసరంగా విడుదల చేయాలని ఆయన కోరారు.

రేషన్ షాపు పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన అసిస్టెంట్ కలెక్టర్ మనీషా బుధవారం పట్టణంలోని 6వ నెంబర్ రేషన్ షాప్‌ను పరిశీలించారు. షాపులో లబ్ధిదారులకు అందిస్తున్న సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని చేబ్రోలు గ్రామంలో అక్రమంగా నిర్మిస్తున్న లే అవుట్లను ఆమె పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్‌ఐ బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల పోరాటానికి అఖిలపక్షం మద్దతు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మూడు నెలల బకాయి జీతాలను చెల్లించాలని ఇంద్రపాలెం పంచాయతీ కార్మికులు చేపట్టిన పోరాటానికి గ్రామ అఖిలపక్ష కమిటీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఒక నెల జీతాన్ని కార్మికులకు అందజేయడంతో అఖిలపక్ష నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు వసూలు చేసి కార్మికులకు జీతాలు ఇవ్వడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రపాలెం అఖిలపక్ష కమిటీ కన్వీనర్ చింతపల్లి ఉదయభాస్కర్, టిడిపి నాయకులు నెహ్రూ, జనసేన నాయకులు మణికుమార్, వైసిపి నాయకులు పలివెల శ్రీనివాసు, సిపిఎం నాయకులు వాసంశెట్టి చంద్రరావు, సిఐటియు మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా, పంచాయతీ యూనియన్ నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతు ఇస్తున్న అఖిలపక్షం

22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 22న స్థానిక మరిడమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణమాసం చివరి శుక్రవారం జరిగే ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు ఈనెల 20 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సీతారామ సత్రం పటిష్టతపై పరిశీలన

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానంలోని సీతారామ సత్రం పటిష్టతపై జెఎన్‌టియుకె సాంకేతిక బృందం బుధవారం క్షుణ్ణంగా పరిశీలించింది. రత్నగిరిపైకి వచ్చిన ప్రొఫెసర్ వీరేంద్ర, యేసురత్నం, ఇతర అధికారులకు ఇఒ సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం బృంద సభ్యులు ఇఒ సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణతో కలిసి 1984లో 80 గదులతో నిర్మించిన సీతారామ సత్రం వసతి గృహాన్ని పరిశీలించారు. ఈ సత్రం పరిస్థితిని పరిశీలించిన బృందం రెండు మూడు రోజుల్లో ఇఒ సుబ్బారావుకు నివేదికను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




వివరాలు సేకరిస్తున్న సాంకేతిక బృందం

ఇంజనీరింగ్ సిబ్బందిని నిలదీసిన ప్రజలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక ఎస్‌సి కాలనీ ప్రజలు ఇంజనీరింగ్ సిబ్బందిని తాగునీటి కోసం నిలదీశారు. బుధవారం కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంకును ఇంజనీరింగ్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు కాలనీకి సరిగా తాగునీరు సరఫరా కావడం లేదని, వచ్చినా కేవలం 20 నిమిషాలకు మించి రావడం లేదన్నారు. వచ్చిన కొద్దిపాటి నీరు బురదగా వస్తుందని సిబ్బందిని ప్రజలు నిలదీశారు.

కార్టూన్ 'నిజం'



మత్తు పదార్థాల వినియోగ నివారణకు కృషి

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం మత్తు పదార్థాల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్‌ఎస్‌కె.దుర్గాదేవి సూచించారు. బుధవారం స్థానిక ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ జూనియర్ కళాశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్‌పై ప్రతిజ్ఞ, అవగాహన కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ అనేది మత్తు ప్రదార్థాలకు వ్యతిరేకంగా భారత్ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులచే పతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కేశవరావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ, బిపిసి సూర్యకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'నషా ముక్త్ భారత్' అభియాన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా సిఐ ఎ.కృష్ణభగవాన్, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడారు. పొగాకు, మద్యం, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు ఒక్క వ్యక్తినే కాకుండా, మొత్తం కుటుంబాన్ని, సమాజాన్ని నాశనం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీదేవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఉమాదేవి, ఎండి సుల్తాన్‌బీబి, హెచ్‌ఎంలు కె.ప్రసూన, దేవప్రసాద్, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. **తాళ్ళరేవు** స్థానిక జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్స్ కో ఆర్డినేటర్ వి.మాధవి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మంగాయమ్మ, డిసిపియు సోషల్ వర్కర్ చిన్నబాబు, జిఎంఎస్‌కె. రమ, క్రాఫ్ ఎన్‌జిఒ ప్రతినిధి త్రిమూర్తులు, ప్రిన్సిపల్ కె.సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న త్రీమెన్ కమిటీ సభ్యులు

త్రీమెన్ కమిటీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు పిఎసిఎస్ అధ్యక్షులుగా విళ్ళ వీరవెంకటఆదినారాయణ డైరెక్టర్లుగా సామాసత్య త్రిపురసుందరి, నిమ్మకాయల దుర్గభవాని బాధ్యతలు స్వీకరించారు. బుధశారం సొసైటీ రిజిస్టర్‌లో సిఇఒ దూళిపూడి మోహన్ వారితో సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా పూర్వపు సొసైటీ అధ్యక్షులు దున్న జనార్ధనరావు, ఉపాధ్యక్షులు చంటిరాజు నూతన కమిటీని అభినందించారు. అనంతరం త్రీమెన్ కమిటీని జనసేన మండల అధ్యక్షులు అత్తిలి బాబూరావు, నాయకులు గుద్దటి జమ్మి, ముత్యాల జయలక్ష్మి, సర్పంచులు పుణ్యమంతుల సూరిబాబు, పంపన రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, మాజీ జడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు సత్కరించారు. అలాగే ప్రజాసంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, మోర్త రాజశేఖర్, కెఎస్.శ్రీనివాస్ నూతన కమిటీని అభినందించారు.

నేరాలు ఘోరాలు

చీటింగ్ కేసులో నిందుతుని అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ వ్యక్తిగత సహాయకుడిని అంటూ చీటింగ్ చేసేందుకు యత్నించిన నిందుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం గుడిమూలం గ్రామానికి చెందిన జి.రాజకుమార్ అలియాస్ వంశీ ఇటీవల గోకవరం ప్రాంత గోల్డ్ వ్యాపారి పట్నాల నాగేంద్ర ఫోన్ చేశాడు. తాను ఎంఎల్ఎ పిఎ అని పరిచయం చేసుకుని టిటిడి విఐపి దర్శనం టికెట్లు ఇప్పిస్తానని చెప్పాడు. దానికి రూ.50 వేలు ఖర్చు అవుతుందని చెప్పాడు. దీంతో అప్రమత్తం అయిన గోల్డ్ వ్యాపారి ఎంఎల్ఎ పిఎ ప్రసాద్‌కు సమాచారం అందించడంతో ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో అతను గోవా ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. అతన్ని కోర్టులో హాజరు పరుస్తామని సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. రాజ్ కుమార్‌పై పలు చోట్ల చీటింగ్ కేసులు ఉన్నాయని చెప్పారు.

బైకు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు ..18 బైకుల స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వరస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి, 18 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ జోన్ డిఎస్‌పి కె.రమేష్ బాబు తెలిపారు. ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలు చేసే వ్యక్తుల మీద ప్రకాష్ నగర్ పోలీసులు సిఐ బాజీలాల్ అధ్వర్యంలో నిఘా పెట్టారు. బుధవారం రాజమహేంద్రవరం ఆర్‌టిఒ ఆఫీస్ వద్ద వాహనాల తనిఖీలో కాకినాడకు చెందిన ఇంటి సురేంద్ర, కామిరెడ్డి ఏసుబాబును అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనపరిచిన సిఐ బాజీలాల్, ఎస్ఐ జి.సతీష్ హెచ్‌సిలు వి.నాగరాజు, సిహెచ్.శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ ప్రదీప్ కుమార్, వీరబాబు, దుర్గప్రసాద్, శివ ప్రసాద్‌ను ఎస్‌పి డి.నరసింహ కిషోర్ అభినందించి రివార్డ్ ప్రకటించారు.


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రేషన్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రభుత్వ పౌరసరఫర రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు, విజిలెన్స్ డిసిటిఒ ఎం.నవీన్ కుమార్ గోపాలపురంలో రేషన్ షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వచ్చిన స్టాకుకు ప్రస్తుతం ఉన్న స్టాక్‌కు సంబంధించినవి పరిశీలించారు. షాప్ నెంబర్ 2లో 13 ప్యాకెట్ల 6.5 కేజీల పంచదార ఉండవలసిన దానికన్నా అధికంగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీనిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో విఆర్ఒ జివివి.లక్ష్మి, విజిలెన్స్ కానిస్టేబుల్ లోవరాజు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో బుధవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థుల తో తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో పాక్ ఆక్రమిత కాశ్మీరులోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసి ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తిరంగా యాత్ర కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. జాతీయ జెండాలు చేత పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ సైనికులకు మద్దతు పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు సంబరాలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రం లో బుధవారం రైతు సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో కొత్తపేట ఎంఎల్ఏ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు తరలి రావడంతో పాటు 200 పైగా ట్రాక్టర్లతో చొప్పెల్ల, నవాబు పేట, కొత్తూరు సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ నినాదాలతో వారి చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఏ బండారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకంలో మొదటి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.2320 కోట్ల రైతుల ఖాతాలో జమ చేసిందని తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలో 23వేల మంది రైతులకు సుమారుగా రూ. 17కోట్లు జమ చేసిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆకుల రామ కృష్ణ, కొత్తపల్లి వెంకటలక్ష్మి,చిలువూరి సతీష్ రాజు, పాలూరి సత్యానందం పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

నరసరావుపేట గ్రామ సచివాలయం వద్ద బుధవారం సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి మణిదీప్ ఆధ్వర్యంలో ఈ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎఒ మాట్లాడుతూ సమాచారం చట్టం 2005 గురించి పలు కీలక విషయాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎఇ ఒ. అజయకుమార్, నరస పురపుపేట గ్రామసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఎస్ఐ నూకరాజుకు సేవా పతకం

ప్రజాశక్తి - యానాం



యానాం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శేరు నూకరాజు ప్రతిష్టాత్మక రాజీవ్ గాంధీ పోలీస్ ప్రతిభా సేవా పతకానికి ఎంపికయ్యారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 27 మంది పోలీసులను వారీ ప్రతిభ ఆధారంగా ప్రభుత్వం ఎంపిక చేసింది. యానాం నుంచి నూకరాజు ఎంపికయ్యారు. పోలీసు శాఖలో 37 సంవత్సరాల సర్వీస్ కలిగిన నూకరాజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం పుదుచ్చేరిలో జరిగే వేడుకల్లో లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్, ముఖ్యమంత్రి రంగస్వామి చేతులమీదుగా ప్రతిభా సేవా పతకాన్ని నూకరాజు స్వీకరించనున్నారు. గత 13 ఏళ్లుగా ఎస్ఐగా నూకరాజు సేవలందిస్తున్నారు.


గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎస్‌పి కోదండరాం

ఆకట్టుకున్న ఫైనల్ కవాతు రిహార్సల్స్

ప్రజాశక్తి - యానాం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బుధవారం స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో నిర్వహించిన ఫైనల్ కవాతు రిహార్సల్స్ ఆకట్టుకుంది. ఎస్‌పి చింతా కోదండరాం, సిఐ అడలరసన్, ఎస్ఐలు పుణీత్ రాజ్,కట్టా సుబ్బరాజు, శేరు నూకరాజు ఆధ్వర్యంలో పుదుచ్చేరి పోలీస్, ఇండియన్ రిజర్వ్ బెటాలియన్, హోంగార్డ్స్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కవాతు నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు నృత్య ప్రదర్శనల సాధన చేశారు. ఈ కార్యక్రమాలను ఎస్‌పి కోదండరాం పర్యవేక్షించారు.

2 రోజులుగా తాగునీటి ఇబ్బందులు

పజాశక్తి - యానాం

గత రెండు రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని జిఎన్.నాయుడు కాలనీ, రాజరాజేశ్వరి నగర్, నవాజ్ గార్డెన్స్, కామరాజ్ నగర్ ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. మెట్టకూరు, జిఎన్.నాయుడు కాలనీ ప్రధాన డ్రెయినేజిలో పూడిక తీతతో పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు. దీంతో తాగునీరు, డ్రెయినేజి నీరు కలుషితమై పోవడంతో నీటి సరఫరాను నిలిపివేశారు. అయితే ప్రజల ఫిర్యాదుతో విషయం తెలుసుకున్న స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధికారులతో వెళ్లి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిశీలించి తక్షణమే తాగునీరు అందించేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు.

టెన్త్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌కు గవర్నర్ ఆహ్వానం

ప్రజాశక్తి - కాకినాడ


నేహాంజని నీ సన్మానిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి (ఫైల్ ఫోటో)

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులు సాధించిన స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ యాళ్ల నేహాంజనికి గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి ఎట్ హోం కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానపత్రం అందుకున్న యాళ్ళ నేహాంజని విశేష గౌరవం పొందింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆతిథ్యంతో ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు విజయవాడ రాజ్ భవన్‌లో జరగనున్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి స్టూడెంట్ టాపర్స్ విభాగంలో నేహాంజనిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఆమెకు సన్మానం నిర్వహించగా నేహాంజని తన విద్యలో సాధించిన విజయాన్ని గుర్తిస్తూ ప్రశంసలు అందించారు.


వైద్య సేవలందిస్తున్న వైద్య బృందం

మూలపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని మూలపేట గ్రామంలో టిడిపి నాయకుల ఆధ్వరంలో వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన టిడిపి నాయకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మెరుగు రాజారావు, సూరిబాబు, కంబాల వెంకటరమణ, సిద్ధి నాగు, ఏడిద లక్ష్మణ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.


లారీ నుంచే నేరుగా రైతులకు సరఫరా చేస్తున్నయూరియా

సొసైటీ వద్ద యూరియా పంపిణీ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక పిఎసిఎస్ సొసైటీ వద్ద యూరియాను రైతులకు పంపిణీ చేశారు. సొసైటీలో యూరియా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పిఎసిఎస్‌కు యూరియా లోడు రావడంతో రైతులు పెద్ద సంఖ్యలో పిఎసిఎస్‌కు చేరుకున్నారు. దీంతో రోడ్డు మీదే పోలీసుల సమక్షంలో సొసైటీ సిబ్బంది యూరియాను రైతులకు పంపిణీ చేశారు. అయినా కొంతమంది రైతులకు యూరియా దక్కలేదు. ప్రస్తుతం అందని రైతులకు వచ్చే స్టాకును సరఫరా చేస్తామని అధికారులు వెల్లడించారు.

'వంతెన నిర్మాణ పనులకు కృషి'

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలో వంతెన నిర్మాణ పనులు చేపట్టేలా కృషి జరుగుతుందని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని బలరామ పురం, ఎ.మల్లవరం రహదారి మధ్యలో ఉన్న రహదారిపై తుపాన్, భారీ వర్షాలు పడుతున్న సమయంలో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని బలరామపురం ఎంపిటిసి శ్రీసోమరౌతు రవి, సొసైటీ అధ్యక్షులు పైలా పైడ్రాజు ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆమె బుధవారం మండల పర్యటనలో భాగంగా వరద ఉధృతి ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. ముఖ్యంగా బలరామపురం, ఎ.మల్ల వరం రహదారిలో ఉన్న వంతెన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ నరేష్, స్థానిక నాయకులు నాయుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ ఈ వారం కతార్ ఎనర్జీ లిమిటెడ్ ఉద్యోగి మొండి శ్రీను పుట్టినరోజు సందర్భంగా శ్రీను, ఆయన బాల్య స్నేహితుల సహకారంతో 15 రకాల పౌష్టికాహార వంటకాలతో అన్నదానం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను తల్లిదండ్రులు మొండి సోమశేఖర్, భానుమతి, అనంతపల్లి సతీష్‌కుమార్, గొంతిన శ్రీను, కోకేడ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగులకు జాతీయ జెండాల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వేస్టేషన్ సిబ్బందికి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో తొలుత బోకారో ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న పాంట్రీ కార్లో ప్రయాణికులకు విక్రయించేందుకు తయారు చేసిన ఆహార పదార్ధాల నాణ్యతను ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలసి పరిశీలించారు. నాణ్యమైన ఆహారాన్ని ప్రయాణికులకు అందించాలని సిబ్బందికి సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు జాతీయ జెండాలను ఉచితంగా అందజేశారు. అలాగే మత్తు పదార్ధాల రహిత సమాజ స్థాపనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్టేషన్ మేనేజర్ రమేష్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలకు లోను కాకుండా విద్యార్థులు, యువత అవగాహన పొందాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.గిరి, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ బి.కల్యాణి, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, టిటిఐ చైతన్య, జిఆర్‌పి ఎఐ వాసు, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, స్టేషన్ సూపరిండెంటెంట్ జికెఎస్.శ్రీదేవి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారిణి ఐ.శారద ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకుల ముఖ ఆధారిత హాజరు, టీచింగ్ డైరీ, నోట్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డు నియమ నిబంధనలు, సంస్కరణలను అధ్యాపకులు అవగాహన చేసుకోవాలని సూచించారు. సమయపాలన పాటించడం, సిలబస్ పూర్తి చేయడం, పరీక్షలను సకాలంలో నిర్వహించడం అవసరమని అన్నారు. అడ్మిషన్ల శాతం పెంపునకు కృషి చేసిన ప్రిన్సిపల్ సిహెచ్.లీలాశ్రీదేవిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను బుధవారం అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ పరిశీలించారు. శానిటేషన్ పనులను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. వేడుకలలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తనీయకుండా.. పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. సభాప్రాంగణం, గ్యాలరీలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పరేడ్ గ్రౌండ్ వెలుపల డ్రెయిన్ల మరమ్మతుల కారణంగా ఏర్పడిన డెబ్రిస్‌ను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట నగర ఆరోగ్యశాఖాధికారి వినూత్న, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని సూచన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఫార్మేటివ్-1 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ హెచ్‌ఎంలను ఆదేశించారు. స్థానిక బైపాస్ రోడ్డులోని దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులను పదో తరగతి కామన్ పరీక్షల మాదిరిగా కూర్చోబెట్టవలెనన్నారు. పరీక్షలు అయిన తరువాత వెంటనే బుక్ లెట్‌లో విద్యార్థుల జవాబులను దిద్ది, మార్కులను రిజిస్టర్లో నమోదు చేసి, ఆన్‌లైన్ చేయాలన్నారు. స్కూల్ హెచ్‌ఎం ఎస్.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీల అమలుకు కృషి

ప్రజాశక్తి - చాగల్లు

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు కౌలు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు ఆవేదం వ్యక్తం చేశారు. రైతులకు జిల్లాలో చాలామందికి పిఎం కిసాన్ సొమ్ములు పడలేదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కలగజేసుకుని మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల పరిధిలో కొవ్వాడ కాలువ ఆధునికీకరణ రైతుల కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పనులపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

పి-4 పథకంలో భాగస్వాములు అవ్వాలి

ప్రజాశక్తి -నిడదవోలు

పేదరికం లేని సమాజం కోసం సిఎం చంద్రబాబు తీసుకొచ్చిన పి-4 పథకంలో అందరూ భాగస్వామ్యులు అవ్వాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహిరంచిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పి.-4 అమలు ద్వారా భవిష్యత్‌లో సమాజంలో మంచి మార్పు వస్తుందని మంత్రి దుర్గేష్ తెలిపారు. నిడదవోలు నియోజకవర్గంలో 7,862 బంగారు కుటుంబాలను, 19,901 మంది బంగారు కుటుంబంలో వ్యక్తులను, 685 మంది మార్గదర్శులను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ షేక్ వజీరుద్దీన్, నిడదవోలు ప్రత్యేకాధికారి కె.సతీష్, పాల్గొన్నారు.

యువత ఉజ్వల భవితే లక్ష్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె ఆధ్వర్యంలో 'నషాముక్త భారత్ అభియాన్' కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈగిల్ కో ఆర్డినేటర్ డాక్టర్ జె.సురేష్, రసాయన శాస్త్ర విభాగంతో కలిసి నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె మాట్లాడుతూ, "యువత ఎటువంటి చెడు అలవాట్లకూ లోను కాకుండా, క్రమశిక్షణతో మంచి అలవాట్లను అలవర్చుకుని ఉజ్వల భవిష్యత్తు వైపు పయనించాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈగిల్ కమిటీ జిల్లా సిఐ పివి.సూర్యమోహన్, ఆర్ఐ నారాయణ, ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాస్ రావు, ఈగిల్ కమిటీ సభ్యులు జె.యాకూబ్, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ జి. రవితేజ పాల్గొన్నారు.


నాచుతో ఉన్న నీటి తొట్టి

దుర్వాసనతో పశువుల నీటి తొట్టి

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ కార్యాలయం వెనుక ఆవరణలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన పశువుల నీటి తొట్టి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ రహదారి మీదుగానే పశువులు చేలల్లోకి వెళుతుంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పశువుల దాహం తీర్చేందుకు నీటి తొట్టెను నిర్మించారు. అయితే ప్రతిరోజు ఈ తొట్టిలో నీటిని నింపుతున్నారు. కానీ తొట్టెను శుభ్రం చేయడం లేదు. దీంతో నీటి తొట్టి నాచు పట్టి దుర్వాసన వెదజల్లుతోంది. కావున అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు నీటితొట్టెను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని పశువుల రైతులు కోరుతున్నారు.

పిడిపి 999 నాచు కట్టిన పశువుల నీటి తొట్టి

భవిత స్కూలుకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మల్లిసాల పంచాయతీ వార్డు సభ్యులు ఇంజరపు దుర్గబాబు స్థానిక భవిత స్కూల్‌కు ప్రింటర్‌ను బహుకరించారు. బుధవారం దుర్గబాబు మేరీ దంపతుల పెళ్ళిరోజును పురస్కరించుకుని భవిత స్కూల్ విద్యార్థులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భవిత స్కూల్‌కు రూ.13 వేల విలువ చేసే ప్రింటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత స్కూల్ టీచర్ అప్పాన పెద్దకాపు, చినబాబు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మారుతున్న వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా రైతన్నలు ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని ఉద్యానవన శాఖ ఎడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఎర్రవరం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేస్తున్న ఆధునిక వ్యవసాయ పనిముట్లు వినియోగించుకోవాలని కోరారు. రైతులు లాభసాటిగా ఉండే వ్యవసాయాన్ని సాగు చేసుకుని క్రిమి కీటకాలు నిర్మూలన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారి కె.దివ్యశ్రీ, ఎఒ నరసింహారావు, బాస ప్రసాద్, మైరాల కనకారావు, ఆకుల నాని, బీశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ బండారుకు మంత్రి లోకేష్ పరామర్శ

ప్రజాశక్తి - కొత్తపేట

ఆలమూరు లో జరిగిన అన్నదాత సుఖీభవ రైతుల కార్యక్రమంలో తృటిలో ప్రమాదం నుండి బయటపడిన కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావును బుధవార విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫోన్ చేసి పరామర్శించారు. ముందుగా ఎంఎల్ఎ సత్యానందరావు కు ఫోన్ చేయగా ఆయన ఫోన్ కు అందుబాటులో లేరు. దీంతో సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కేంజవరపు అచ్చం నాయుడు పలువురు మంత్రులు సహచర ఎంఎల్ఎలు, కలెక్టర్, ఎస్‌పి తదితరులు ఎంఎల్ఎ బండారును పరామర్శించారు.

దళితుల ఐక్యతపై దేశ వ్యాప్త కుట్ర

ప్రజాశక్తి - పిఠాపురం

దళితుల ఐక్యతపై దేశవ్యాప్త కుట్ర జరుగుతుందని మాల మహానాడు నాయకుడు ఆర్ఎస్.రత్నాకర్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటుచ చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజికవర్గంపై తెలుగు రాష్ట్రాల్లో కత్తిగట్టాయని విమర్శించారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్న జగన్ సైతం ఎస్‌సి వర్గీకరణపై నోరు మెదపడం లేదన్నారు. రాజ్యాంగ వ్యవస్థల్ని మోడీ నిర్వీర్యం చేశారని, బ్యాలెట్ పేపర్‌తో గెలిచి తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని సవాల్ చేశారు. కుల, మతాల పేరుతో ప్రజలను విభజించి పాలిస్తున్న బిజెపి ఆటలు ఎంతో కాలం కొనసాగదని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎస్‌సి వర్గీకరణ తాత్కాలికమేనని, శాంతియుత నిరంతర పోరాటం సాగిస్తామని అన్నారు. ఏడుగురు న్యాయమూర్తుల తీర్పును 11 మంది న్యాయమూర్తుల బెంచ్‌తో వర్గీకరణ తీర్పును పున్ణ సమీక్షించేంతవరకు పోరాటాన్ని సాగిస్తామని అన్నారు. ఈ సమావేశం లో కొప్పుల ప్రేమ్‌బాబు, సూరిబాబు, కొండబాబు, సత్తిబాబు, బాబులు, వెంకట్రావు, పాల్గొన్నారు.